www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి



కౌలురైతులకు రూ.46.79 కోట్ల పంట రుణం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఏలూరు ప్రతినిధి:ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 57,652 సిసిఆర్‌సి కార్డుల లక్ష్యానికిగాను 43,551 కౌలుకార్డులు అందించామని, ఇప్పటి వరకూ రూ.46.79 కోట్లు పంటరుణాలు మంజూరయ్యాయని వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 28వ తేదీన కౌలు రైతులకు వ్యవ'సాయమేది'..! అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలైన పెట్టుబడి రాయితీ, రైతుభరోసా, ధాన్యం అమ్ముకోవడం వంటివి ఇబ్బందుల్లేకుండా సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు భూయజమాని, కౌలురైతులను సమన్వయపరుస్తూ ఇరువురు పరస్పర అంగీకారానికి వచ్చేదిశగా గ్రామాల్లో రైతుల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ 'పరేషాన్'..!

- విడుదల కాని సరెండర్ లీవుల సొమ్ము
- ఏడాదికిపైగా టిఎ బిల్లులు పెండింగ్
- పండుగల అడ్వాన్స్‌లూ నిలుపుదల
- అందని జిపిఎఫ్ రుణాలు
- క్యాంప్ ఆఫీసు విధుల్లో కనీస వసతులు కరువు
- ప్రభుత్వ తీరుపై ఖాకీల్లో తీవ్ర చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎండనక, వాననక శ్రమించే పోలీసులను సైతం ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నిబంధలనల ప్రకారం వారికి ఇవ్వాల్సిన సొమ్ములు చెల్లించంచకుండా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. గతంలో ఎన్నడూ చూడని ఇలాంటి పరిణామాలపై పోలీసులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా సివిల్, ఎఆర్ విభాగంలో దాదాపు మూడువేల మంది వరకూ పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఆందోళనలు, ప్రజాప్రతినిధుల పర్యటనలు వంటి పలు కార్యక్రమాలతో పోలీస్ సిబ్బందికి విరామం అనేది లేకుండా పోతుంది. సెలవులతో నిమిత్తం లేకుండా పనిచేస్తారు కాబట్టి పోలీసులకు ఏడాదికి 45 సరెండర్ లీవులిస్తారు. ఈ లీవులకు సంబంధించిన సొమ్ములను జనవరి, జులై, నవంబర్‌లో పోలీసులకు జమచేస్తారు. డిసెంబర్ నెల వచ్చినప్పటికీ సరెండర్ లీవుల సొమ్ము ఇవ్వలేదని పోలీసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సొమ్ము వస్తే పిల్లల ఫీజులకు, ఇంటి ఆర్థిక అవసరాలకు ఉపయోగించుకోవచ్చని పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలుగానే మారిపోతున్నాయి. క్రిస్మస్, సంక్రాంతి పండుగకు అడ్వాన్స్‌లుగా రూ.ఆరు వేల నుంచి రూ.ఏడువేలు వరకూ ఇస్తున్నారన్నారు. ఈ సొమ్ముతో పిల్లలకు పండుగ బట్టలతో ఇంట్లో పిండి వంటకాలకు ఉపయోగించుకునే పరిస్థితి ఉండేది. ఈ సొమ్ములు తీసుకున్న ఉద్యోగుల నుంచి ప్రతినెలా జీతంలో కొంతమేర రికవరీ చేస్తారు. ఫెస్టివల్ అడ్వాన్స్‌లు సైతం లేకుండా పోయాయని పోలీసులు తీవ్రఆవేదనకు గురవుతున్నారు. పోలీసులు బందోబస్తుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇందుకుగాను ప్రతినెలా రూ.1500 టిఎ(రవాణా ఛార్జీలు) ఇస్తారు. స్పెషల్ పార్టీ సిబ్బందికైతే టిఎ కింద రూ.4,500 ఇస్తారు. దాదాపు ఏడాదికిపైగా టిఎ బిల్లులు ఇవ్వలేదు. దీంతో చేతిసొమ్ములు పెట్టుకుని దూరప్రాంత విధులకు వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో పోలీస్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ ఉద్యోగి జీతం నుంచి నెలనెలా జిపిఎఫ్ కింద కొంత సొమ్ము పక్కకు తీస్తారు. పిల్లల చదువులకుగానీ, పిల్లల వివాహాలకు గానీ, ఇల్లు కట్టుకున్నప్పుడు జిపిఎఫ్ సొమ్మునుంచి ఉద్యోగులు రుణాలు పొందుతారు. జిపిఎఫ్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వకపోవడంతో ఖాకీల బాధ వర్ణనాతీతంగా మారింది. ఇలా పోలీస్ సిబ్బందికి అందాల్సినవి ఏ ఒక్కటీ సక్రమంగా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. పోలీసులకు అందాల్సినవి ఏ ఒక్కటీ ఇవ్వకపోయిప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీసులు విమర్శలను సైతం మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిరంతరం శ్రమించే పోలీసుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిబ్బందిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసుల సమస్యలపై యూనియన్లు సైతం సరిగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్యాంప్ ఆఫీస్ విధుల్లో కష్టాలు

సిఎం క్యాంప్ ఆఫీసు వద్ద ప్రతినెలా జిల్లానుంచి కొంతమంది సిబ్బందికి విధులను కేటాయిస్తారు. ఈ విధులు 15 రోజులు చేయాలి. అక్కడకు వెళ్లిన సిబ్బందికి కనీస సౌకర్యాలు గానీ, ఖర్చులుగానీ ఇవ్వడంలేదని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. వీరికి ఇచ్చే బస విధులు నిర్వహించే ప్రాంతానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రతీరోజు ప్రయాణ ఖర్చులు, భోజన ఖర్చులు భారమవుతున్నాయి. దీంతో సిఎం క్యాంప్ ఆఫీసు విధులంటే సిబ్బంది భయటపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వీక్లీ ఆఫ్ సైతం అమలుకావడం లేదు. ఇలా అనేక సమస్యలతో పోలీస్ సిబ్బంది సతమతమవుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని పోలీసులు కోరుతున్నారు. పోలీస్ యూనియన్లు సైతం సిబ్బంది సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన పరిస్థితి ఉందన్న చర్చ సాగుతోంది.



భీమవరంలో ప్రచారయాత్రను ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

మోడీ హయాంలోనే కార్మికులకు కష్టాలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

రెండో రోజు కొనసాగిన సిఐటియు రాష్ట్ర మహాసభ జిల్లా ప్రచార జాతా

జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతే కార్మికవర్గం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం సిఐటియు రాష్ట్ర మహాసభ జిల్లా ప్రచార యాత్ర రెండో రోజు భీమవరం పట్టణంలో పోలీస్ బొమ్మ కూడలిలో ప్రారంభమైంది. యాత్రను ఉమామహేశ్వరరావు ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న కార్మికులకు అనుకూలంగా ఒక్కటంటే ఒక్కచట్టం కూడా తీసుకురాలేదని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. పెట్రో ధరలు మండుతున్నాయన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి చెబితే 'నేను ఉల్లిపాయ తినను, పెట్రోల్ కొట్టించుకోను నాకెందుకు' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని గుర్తుచేశారు. కనీసం ప్రజల సమస్యలు కూడా వినని పాలకుల చేతిలో దేశ భవిష్యత్ ఎలా ఉంటుందన్నారు. అంతే కాకుండా కార్పొరేట్ల కోసం దేశవ్యాప్తంగా జిఎస్‌టిని తీసుకువచ్చి తినే తిండి నుంచి రోడ్డు మీద చెత్త వరకూ ఆఖరికి చనిపోయిన తర్వాత ఖననం చేసేటప్పుడు కూడా జిఎస్‌టి కట్టాల్సిన పరిస్థితిని దేశంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రత్యక్షంగా దోచిపెడితే, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదనే చేతిలో పెడుతుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లధనం వెలికితీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని చెప్పిన మోడీ మాట తప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఎనిమిదేళ్ల కాలంలో కార్మికులు ఉపాధి కోల్పోతుంటే, అంబానీ, ఆదాని వంటి వాళ్లు రూ.లక్షల కోట్లు కూడగట్టుకుని ప్రపంచ జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో దేశ ప్రజలను గాలికి వదిలేసిన ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశంలో సరైన వైద్యం, బెడ్స్, ఆక్సిజన్, వ్యాక్సిన్, మెడిసిన్ సదుపాయాలు లేక 50 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శులు మల్లిపూడి ఆంజనేయులు, అల్లూరి అరుణ్ కార్మికులు పాల్గొన్నారు.



ఆకివీడుకు చేరిన ప్రచార జాతా..

ఆచంట : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం దారుణమని, పరిశ్రమల యజమానులకు, కార్పొరేట్లకు అనుకూలంగా మార్చడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.అజయ్‌కుమారి అన్నారు. భీమవరంలో వచ్చేనెల 2,3,4 తేదీల్లో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా బుధవారం ఉదయం ఆచంట కచేరీ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అజయ్‌కుమారి మాట్లాడుతూ కార్మిక సమస్యలపై మాత్రమే కాకుండా ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, కర్షకులు, చిరు వ్యాపారుల సమస్యలపై అలుపెరగని ఐక్య ఉద్యమాలు సిఐటియు ద్వారా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉషారాణి, అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, నాగ ఆంజనేయులు, నాయకులు శ్రీదేవి, అమ్మామణి, కనకదుర్గ, బాలాజీ ఏడుకొండలు, దళ సభ్యులు, శ్రీను, నాగేంద్ర, శివ గణేష్, రవి, నరేష్, వెంకన్న, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పెనుమంట్ర : సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అజయకుమారి ప్రజలకు, కార్మికులకు పిలుపునిచ్చారు. జిల్లాలో చేపట్టిన ప్రచార జాతా బుధవారం మార్టేరు సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోతురాజు, సూర్యారావు, అప్పారావు, కూసంపూడి సుబ్బరాజు, ఆకుల హరేరామ్, పి.శ్రీను, టి.శ్రీను, కె.నరేష్, డిఎస్.గణేష్, వై.వెంకన్న, కె.రవి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పోడూరు : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆరేపల్లి వెంకటనారాయణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ముడే మోజెష్, సిఐటియు జిల్లా నాయకులు బి.వెంకట్రావు, గీత కార్మిక సంఘం నాయకులు నార్ని వెంకటేశ్వరరావు, దొంగ నాగేశ్వరరావు, దొంగ సింహాచలం, దూబోయిన దుర్గారావు మాట్లాడారు.

మొగల్తూరు : సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మొగల్తూరులోని డిసిసిబి బ్యాంక్ వద్ద ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు కొత్తపల్లి గోవింద్, ఎస్.కుమార్, గుబ్బల శ్రీనివాస్, ఎస్.ఏసు, అర్జున్‌రావు, కొప్పనాతి, వెంకటస్వామి, నాయకులు ఆదూరి సాంబమూర్తి, కొత్తపల్లి నాగరాజు, యడ్ల చిట్టిబాబు, కంచర్ల సోనీ ఉన్నారు.

ఉండి : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు కోరారు. బుధవారం మధ్యాహ్నం సిఐటియు ప్రచార జాత ఆకివీడు నుండి ఉండి మెయిన్ సెంటర్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, నాయకులు మోపిదేవి రాము, ఆవు రాంబాబు, చైతన్య ప్రసాద్, షేక్ వలి, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ఆకివీడు:సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రజార జాతా బుధవారం ఆకివీడు చేరింది. ఈ జాతాకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, లారెన్స్ కుమారి, చైతన్య ప్రసాద్, షేక్ వలి, పెంకి అప్పారావు, తవిటి నాయుడు, బుర్ర శీను, అప్పలనాయుడు, తోట పద్మ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పేరుతో పథకాలు ఆపడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమ పథకాల అమలుకు విద్యుత్ బిల్లులను ముడిపెట్టడం సరికాదని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, పింఛన్లు రద్దు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, పింఛన్లు రద్దు చేసే చర్యలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతూనే, మరోవైపు ఆ పథకాలను కుదించి, కత్తిరించే పని చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకవైపు కరెంటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే సర్వీస్, ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచి, ఇప్పుడు కరెంటు ఛార్జీలు ఎక్కువగా వస్తున్నాయని సాకు చూపి ప్రజలకు కాస్త ఊరటగా ఉన్న సంక్షేమ పథకాలకు స్వస్తి చెప్పడం అంటే ఇంతకన్నా దుర్మార్గం ఉండదన్నారు. చిన్న గ్రామాల్లో వంద నుంచి 200 వరకూ, పెద్ద గ్రామాల్లో 250 నుంచి 300 వరకూ రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించారని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. సిఎం జగన్ దీనిపై స్పందించి రేషన్ కార్డులు, పింఛన్ల రద్దును నిలుపుదల చేయాలన్నారు. అదే విధంగా కరెంటు ఛార్జీలు కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. గతం టారిఫ్‌లను కొనసాగించాలన్నారు.

సచివాలయాల్లో అన్ని సేవలూ అందించాలి : జెసి

ఉండి:ప్రజలను మీసేవా కేంద్రాలకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో సేవలన్నీ సచివాలయంలోనే అందించాలని జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం, చెరుకువాడ, అర్తమూరు, పాములపర్రు గ్రామ సచివాలయాలను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండరు, గడువులోగా ప్రజాసమస్యల పరిష్కార నివేదికలను పరిశీలించారు. డిసెంబర్‌లో ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అన్నది పరిశీలించారు. ఆయా నెలల్లో ప్రభుత్వం అమలు చేసే సంబంధిత పథకాల అర్హుల జాబితాను ప్రతినెలా సచివాలయంలో ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమన్నారు. సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలందరికీ అవగాహన కల్పించి, అంకిత భావంతో ఉండాలన్నారు. సచివాలయంలో ఆలస్యం లేకుండా ప్రజలకు పౌరసేవలు అందించాలని, అవికూడా ప్రజలు సంతృప్తి చెందే విధంగా నిర్దిష్ట సమయంలో అందించడం ద్వారా సచివాలయ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

పెన్షనర్ల సమస్యలు పట్టని ప్రభుత్వం

రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్న సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా బుధవారం పెన్షనర్స్ కార్యాలయం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్రఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర పెన్షనర్స్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రతినెలా ఒకటో తేదీకి పెన్షన్ రాకపోవడంతో పెన్షనర్స్ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత పిఆర్‌సిలో ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువగా ఇస్తున్నారన్నారు. 70, 75 సంవత్సరాలకు ఇచ్చే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ తగ్గించడం దారుణమన్నారు. మట్టిఖర్చులు కూడా తగ్గించడమేంటని ప్రశ్నించారు. హెల్త్ కార్డులపై కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయకపోవడంతో మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. డిమాండ్లు సాధించేందుకు ఆందోళనకు పిలుపిస్తే ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన జరగబోయే భారీ ర్యాలీ, బహిరంగ సభలో పెన్షనర్లు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిఎ ఎరియర్స్, పిఆర్‌సి ఎరియర్స్, పెండింగ్ మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి రవిప్రసాద్, సూర్యనారాయణ, భాస్కరరావు, అప్పన సత్యనారాయణ, పాండురంగరాజు, జయరాజు, చంద్రరావు, చాన్‌బాష, విశ్వనాధరాజు, విల్సన్ బాబు, సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.



పెన్షనర్లతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇళ్ల స్థలాలు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన వైఎస్ఆర్ జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ సభలో ఆయన ప్రసంగించారు. తాడేపల్లిగూడెంలో 4200 మంది ఇళ్లులేని వారిని గుర్తించామన్నారు. అందులో 3,400 మందికి ఇప్పటికే పట్టాలు పంపిణీ చేశామని, గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మిగిలిన వారికి కూడా 90 రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం 133 మందికి పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూలింత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు చేపట్టలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు మద్దతుగా ఉండాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లు ఇంటింటికీ వచ్చి సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కొలుకులూరి ధర్మరాజు, మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి, తహాశీల్దార్ అప్పారావు, హౌసింగ్ డిఇ ప్రసాద్, కొట్టు విశాల్, మేడపాటి పాల్గొన్నారు పాల్గొన్నారు. అనంతరం 133 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు.



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు

కొనసాగిన సిఐడి అధికారుల విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంలో సిఐడి అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. గణపవరంలోని స్టేటు బ్యాంకులో నకిలీ లీజు పత్రాలతో రుణాలు తీసుకుని ఎగవేసిన సంఘటనపై అధికారులు 28 కేసులు నమోదుచేశారు. ఈ కేసు విచారణలో భాగంగా మొగల్తూరు, శేరేపాలెం గ్రామాలకు చెందిన భూయజమానుల నుంచి ఇటీవల సిఐడి అధికారులు వివరాలు నమోదు చేశారు. పేరుపాలెం నార్త్, పేరుపాలెంసౌత్ గ్రామాలకు చెందిన పలువురి రైతుల వాంగ్మూలాలను నమోదుచేశారు.

నూతన టెక్నాలజీతో గృహ నిర్మాణాలు

హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఉండిలోని లబ్ధిదారులందరికీ నూతన టెక్నాలజీని ఉపయోగించి గృహ నిర్మాణాలు చేపడతామని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎవి రామరాజు తెలిపారు. బుధవారం ఉండి గ్రామ పంచాయతీ ఆవరణలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 520 మంది ఉండగా కేవలం 112 మంది మాత్రమే గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మిగిలిన వారు ఇళ్లు నిర్మించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో భీమవరంలోని టిడ్కో గృహాల మాదిరిగానే ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా సుమారు 60 వేల రూపాయల వ్యయంతో ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఇళ్లన్నీ నూతన టెక్నాలజీ అయిన షేర్ వాల్‌లో భాగంగా ఇంటి నిర్మాణం ఇటుకలు లేకుండా పూర్తిగా కాంక్రీట్‌తోనే నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారుడూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, పాలకవర్గ సభ్యులు కమతం బెనర్జీ, అడబాల వరప్రసాద్, ఉప్పాడ రాము, కోరసిక వెంకట్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రామరాజు

మాట తప్పిన వైసిపి

సైకిల్ యాత్రలో ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

వైసిపి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట తప్పిందని, మాట తప్పిన ప్రభుత్వం రైతులకు సమస్యలు తెచ్చిపెడుతోందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం మండలంలోని పెద్దకాపవరంలో జరిగింది. ఈ యాత్ర పెదకాపురం, చినకాపురం, గుమ్మలూరు, అప్పారావుపేట, కోళ్ల పర్రు, కాలింగ్‌గూడెం, చిన్నమెల్లిపాడు, సిద్ధాపురం మీదుగా ఆకివీడు చేరింది. అక్కడ నుంచి ఐ.భీమవరం చెరుకుమిల్లి తిరిగి ఈ యాత్ర ఆకివీడు చేరింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆక్వా రంగంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారతదేశంలో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. అటువంటి ఆక్వారంగానికి ప్రభుత్వం తీరని నష్టం కల్పిస్తోందన్నారు. ఉండి నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. సైకిల్ యాత్ర వల్ల ఎంతగానో ఉపయోగముందని యాత్రలో జరిగిన అనుభవాలను ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోటుపల్లి ప్రసాద్, రాష్ట్ర నాయకులు గొంట్ల గణపతి, బొల్లా వెంకట్రావు, నవకోట్ల రామారావు, గంధం ఉమా సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

వైసిపి పాలనలో పేదలకు నష్టం : పితాని

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి చేపట్టిన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చక్కటి వేదికని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని వల్లూరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పితాని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల పేదలకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో తిరిగి టిడిపిని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఆయన సూచించారు. కార్యకర్తలు, కన్వీనర్లు సమిష్టిగా టిడిపి గెలుపుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లకు పితాని నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు సర్పంచులు, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, అల్లం పద్మావతి సూర్యప్రకాశరావు, నాయకులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు 25 మంది ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీకి సంబంధించి జాతీయ స్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు వీరవాసరం ఎస్ఎంబిటిఎవి అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 25 కళాశాలల నుండి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ఇరవై ఐదుగురిని ఎంపిక చేసినట్టు చీఫ్‌కోచ్ పి. రామచంద్రమూర్తి తెలిపారు. వీరంతా జనవరి 22, 23 తేదీల్లో మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ యూనివర్శిటీలో నిర్వహించే నేషనల్ టోర్నమెంట్‌లో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ తరుపున పాల్గొంటారని ప్రిన్సిపల్ వలవల నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్, గేమ్స్ ద్వారా వచ్చే సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి వచ్చిన కోచ్‌లు, రిఫరీలు పి.కనకదుర్గ, కె.సురేంద్ర, కె.కృష్ణమోహన్, కళాశాల పీడీ చింతా సతీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పితాని పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మండలంలోని పలువురు టిడిపి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. నెగ్గిపూడి చెందిన బొక్క నాగేశ్వరరావు తండ్రి రామారావు (79) ఇటీవల మతి చెందారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను, అలాగే నెగ్గిపూడి శివారు వనంపల్లిలో వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన కట్టా వెంకటరమణ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లాలు), నెగ్గిపూడి గ్రామ అధ్యక్షుడు చెర్ల బాలాజీ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెలగల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

8 మంది చిన్నారులకు శస్త్ర చికిత్స

భీమవరం రూరల్ : వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జి హాస్పిటల్ (హైదరాబాద్) వారి సహకారంతో మెంటేవారితోటలో సుందరయ్యవనంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (ఎబిఎస్‌వికె) ద్వారా ఎనిమిది మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వారిని క్యాంపులో భాగంగా మంగళవారం రాత్రి విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌కు చెందిన ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.విక్రమ్ వారిని పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. నాలుగు నెలలుగా హృద్రోగంతో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు డాక్టర్ కె.విక్రమ్ కాంపులో పరీక్షల నిర్వహించిన అనంతరం విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట రామరాజుకు, వారి ప్రతినిధులు ఇందుకూరి ప్రసాద్‌రాజు, ఎంవి.రామరాజు, ఎస్ఎల్‌జి హాస్పిటల్, ఎబి ఎస్‌వికెకు కృతజ్ఞతలు తెలిపారు.

గృహ లబ్ధిదారులు బ్యాంకు ఖాతా ప్రారంభించాలి


ప్రజాశక్తి - పెనుమంట్ర

హౌసింగ్ కేటగిరి-3 లబ్ధిదారులతో బ్యాంకు ఖాతా ఓపెన్ చేయించాలని ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి అన్నారు బుధవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు నుండి 5 గంటల వరకూ జరిగే స్పందన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సూచించారు. పెనుమంట్ర, మార్టేరులోని ఆధార్ సర్వీసింగ్ సెంటర్లు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ టిఎ.బాపూజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలకు మెనూ ప్రకారం పెట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పిల్లలను ఫాలోప్ చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ అన్నారు. బుధవారం ఆలమూరు, పెనుమంట్రలో అంగన్‌వాడీ సెక్టార్‌లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిజిబెత్ మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం వండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.ఆదిలక్ష్మి, కార్యకర్తలు, బి.మౌనిక, సిహెచ్.నాగమణి, ఎం.సుబ్బలక్ష్మి, జి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిడిపిఒ ఎలిజిబెత్

ఘనంగా కలెక్టర్ ప్రశాంతి పుట్టినరోజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పుట్టినరోజు వేడుకలు బుధవారం క్యాంపు కార్యాలయంలో జరిగాయి. జెసి జెవి మురళి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ చేత కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో వారి తండ్రి బుచ్చిబాబు పూజలు చేయించారు. జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఆలయ పాలకులు, అర్చకులు ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టరు ప్రశాంతికి స్వామివారి శేష వస్త్రం అందించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు, కుక్కల బాల వెంకటరత్నం పాల్గొన్నారు.

కొనసాగిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


పాలకొల్లు రూరల్: ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ

రైతుల కష్టాలు ముఖ్యమంత్రి జగన్‌కు పట్టడం లేదని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. సగంచెరువు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. ఆయన టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ప్రస్తుతం రైతులు పండించలేమని చెబుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. గ్రామం నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి విన్నవించినా కనీసం లారీలు జాగు చేయలేకపోయారని తెలిపారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ సగంచెరువు గ్రామంలో క్రాప్ హాలిడే ఇచ్చారంటే జగన్ ప్రభుత్వం ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రైతులు పడుతున్న కష్టం ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. అనంతరంసగం చెరువు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గుడాల మనోహర ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, చెల్లబోయిన సహదేవుడు, మాజీ ఎంపిటిసి మల్లుల రవీంద్రకుమార్, టేకు నరసింహస్వామి పాల్గొన్నారు.

నరసాపురం : వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు తీసేయడం దారుణమని టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏనిమిదో వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిడిపి నేత కొప్పాడ నరేష్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను పెరిగిపోయాయని, కరెంట్ బిల్లులు చాలా ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు తీసేయడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ పెండ్ర శీను, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్ర ఠాగూర్ పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల


కాళ్ల : విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న పివిఎల్

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోపల్లె, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ఏలూరుపాడు, మాలవానితిప్ప, బొండాడ, కలవపూడి హైస్కూళ్లు లక్ష్మీనరసింహపురం, కాళ్లకూరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 666 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాడు - నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద రాజు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

ఆచంట : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యతిస్తున్నారని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు, బుధవారం కొడమంచిలి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న 64 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ఈ ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, స్కూల్ ఛైర్మన్ బొరుసు రాంబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని కొట్టాలపర్రు ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు పిసి ఛైర్మన్ తారక రామారావు బుధవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తోలేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు నరసింహులు, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆచంట: విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సీతారాం

పాలకొల్లు రూరల్ : ఆగరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచి సాకా గంగారత్నం విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని పనులు జగన్ ప్రభుత్వంలో జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.మాధవి, ఎస్ఎంసి ఛైర్మన్ అడిదెలా పుష్పలత, వైసిపి నాయకులు సాక కమలాకర్ రావు, ఎంపిటిసి కొయ్యే రత్నకుమారి పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ

ఎఐటియుసి రాష్ట్రనేత బివివి కొండలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐక్య పోరాటాల ద్వారానే కార్మికవర్గ హక్కుల పరిరక్షణ సాధ్యమని ఎఐటియుసి రాష్ట్ర కోశాధికారి బివివి.కొండలరావు స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన ఎఐటియుసి ఏరియా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండలరావు ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చడంతో కార్మికులు కనీస ప్రాథమిక హక్కులను సైతం కోల్పోయారన్నారు. పట్టుదలతో విశాల ఐక్యపోరాటాన్ని కొనసాగించి హక్కులను కాపాడుకోవాలంటూ అలెప్పీ మహాసభ పిలుపు ఇచ్చిందని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ అలెప్పి మహాసభ సందర్భంగా జరిగిన ప్రారంభసభలో బిఎంఎస్, ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్ సహా అన్ని కేంద్ర కార్మిక సంఘాల జాతీయ నాయకులు పాల్గొన్నారని తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జనవరి 30న న్యూఢిల్లీలో జరగనున్న కార్మిక సంఘాల మహాసదస్సులో అన్ని కేంద్ర కార్మిక సంఘాలూ పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బడబళ్ల లక్ష్మీనారాయణ, ఉల్లింకల జయకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళల ఫించన్లు నిబంధనల పేరుతో తొలగించడాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతోందని, వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి వంటి ఇతర పెన్షన్లు ఇస్తూ, ఇప్పుడు ఒక్క సారిగా కరెంటు బిల్లు, ఇంటి స్థలం, కారు, ఇన్‌కం ట్యాక్స్ వంటి వాటిని సాకుగా చూపి తొలగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని విమర్శించారు. మున్సిపాల్టీ వారు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, గార రంగారావు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అభివద్ధి నిమిత్తం మాజీ లయన్స్ క్లబ్ మల్టిపుల్ ఛైర్మన్, ప్రస్తుత మల్టిపుల్ జిఎటి మెంబర్షిప్ ఛైర్ పర్సన్ హెచ్.కృష్ణంరాజు వ్యక్తిగతంగా రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ పి.ప్రశాంతికి విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎంఎస్‌విఎస్ రామభద్రి రాజు, గ్లోబల్ సర్వీస్ కో ఆర్డినేటర్ కొమ్ముల.మురళీకృష్ణ, పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందిస్తున్న కృష్ణంరాజు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా వరం : ముదునూరి

997 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం గౌతమి కళాశాలలో గౌతమి, వికాస్ విద్యా సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ప్రసాదరాజు ప్రారంభించి మాట్లాడారు. యువత వారి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పట్టుదలతో పోటీ పరీక్షల్లో ఇంటర్వ్యూల్లో విజయం సాధించి ఉద్యోగాలు పొందాలన్నారు. వైఎస్ఆర్ బాటలోనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని మరింత మెరుగుపర్చి అమలు చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన బోధన అందిస్తూ గౌతమి విద్యా సంస్థల వ్యవస్థాపకులు చినమిల్లి దుర్గాప్రసాద్ పని చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ జయరాజు మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదవాలన్నారు. చినమిల్లి దుర్గప్రసాద్ మాట్లాడారు. ప్రముఖ అరబిందో, కోజెంట్, బైజూస్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండిగో, ఐసన్, డెక్కన్, రాక్మెన్, హుండాయ్ మోబిస్, హెల్ప్, హోల్ మై ఫ్యామిలీ తదితర బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు 997 పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3 వేల మందికి పైగా అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఛైర్మన్ షేక్ బులి మస్తాన్, సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ గంట్రోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రుణాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కేంద్ర సహకార బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలూ అందిస్తున్నామని మొగల్తూరు డిసిసిబి బ్యాంక్ మేనేజర్ జి.మారేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులోని డిసిసిబి బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ద్వారా రైతులకు వ్యవసాయ పశువుల కొనుగోలు తదితర వాటికి రుణాలు అందిస్తున్నామన్నారు. నగదు డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోరి సాంబమూర్తి, రావుల ముత్యాలరావు, సూపర్‌వైజర్ జగదీష్ పాల్గొన్నారు.

ఆ భూమిలో ఆక్వాసాగుకు అనుమతులెలా ఇచ్చారు?

ఎంఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండి- గణపవరం రోడ్డులోని జగనన్న లే అవుట్‌ను ఆనుకుని ఉన్న సుమారు 3 ఎకరాల పంట భూమిని ఆక్వా చెరువుగా మార్చేందుకు అధికారులు ఎలా అనుమతులిస్తారని ఎంఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు ప్రశ్నించారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్ సరిహద్దుగా ఉన్న పొలాన్ని ఆక్వా చెరువుగా మార్చడానికి అనుమతుల కోసం గత రెండు సంవత్సరాల నుండి తిరుగుతున్నా తనకు అనుమతులివ్వని అధికారులు లే అవుట్‌కు ఆనుకుని ఉన్న పంట భూమికి అనుమతులు ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. తన పొలం ఆక్వా జోన్‌లోనే ఉన్నప్పటికీ పక్కనే ఉన్న లే అవుట్ ను నివాసలకు కేటాయించడంతో ఆక్వా చెరువుల అనుమతులు ఇవ్వడం కుదరదని చెప్పిన అధికారులు ఇప్పుడు ఏ విధంగా సరిహద్దు పంట భూమికి అనుమతులు ఇచ్చారని అధికారులపై మండిపడ్డారు. చట్టం ఎవరికీ చుట్టం కాదు అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల స్థలాలను ఇచ్చిన ప్రాంతంలో తనకు వీలుకాని అనుమతులు వేరే ఒకరికి ఎలా వస్తాయి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పదని తెలిపారు.

కాళ్లకూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు హెచ్ఐవి పరీక్ష నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.గులాబ్ రాజ్‌కుమార్, గ్రామ సర్పంచి సాధు శ్రీదేవి, ఉప సర్పంచి ప్రదీప్‌రాజు, గ్రామ కార్యదర్శి బి.సతీష్ కుమార్, ఐసిటిసి హనుమంత్ పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో గెస్ట్ లెక్చరర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్ఆర్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పెట్రోలియం పరిశ్రమ ఆధునిక విశ్లేషణ పద్ధతులు' అంశంపై గెస్ట్ లెక్చర్ బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య వక్త అయిన ఎస్.చిరంజీవులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మోజెస్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను ఆదాచేసుకోవాలన్నారు. పరిపాల నాధికారి రామకృష్ణంరాజు, విభాగాధిపతి గజపతిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో ఈనెల 29వ తేదీ బిసి చైతన్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు బిసి చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా నలుమూలల నుండి బీసీ నాయకులు సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఉండి: పిసిసి జాయింట్ సెక్రటరీ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉండి మెయిన్ సెంటర్‌లోని కాంగ్రెస్ స్తూపం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో సుమారు 55 సంవత్సరాలు దేశాన్ని పాలించి అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. బడుగు బలహీన వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రా పార్థు, నరసాపురం పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సోము నాగ కేశవ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఎఐసిసి 138వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వారా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, తద్వారా కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో బోనం వెంకట్రావు, పిసిసి సభ్యులు షేక్ మహబూబా జానీ, కొలుకులూరి అర్జున్‌రావు, వర్ధనపు కాసు, బొలిశెట్టి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

వెలగలేరులో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వెలగలేరు పెంతుకోస్తు ప్రార్థనా మందిరం పాస్టర్ యాళ్ల డేవిడ్ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రపంచంలో రెండు వార్తలు మాత్రమే ఉన్నాయని అవి ఒకటి మంచి వార్త రెండు చెడు వార్త అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల సాల్మన్ దొర, వెలగలేరు పంచాయతీ సర్పంచి కొవ్వూరి మధువాణి, వైసిపి నాయకులు కొవ్వూరి పుత్రారెడ్డి బహూకరించిన కేకును కట్ చేశారు.